క్లుప్తంగా

మద్దిలో ప్రత్యేక పూజలు


మద్దిలో హనుమద్ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, గురవాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమద్ది ఆంజనేయ స్వామి సన్నిధిలో హనుమద్ హోమం ప్రతి ఆదివారం భక్తులకు ఆర్జిత సేవగా దేవస్థానం వారు నిర్ణయించారు. కార్యక్రమాన్ని రాజ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారిణి ఆర్‌వీ చందన తెలిపారు.

అయ్యప్ప స్వామికి అభిషేకాలు


స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెంలో వేంచేసియున్న శ్రీహరి హరసుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా మండపారాధన, పుణ్యాహవాచనం, మూల విరాట్‌కు రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. అనంతరం స్వాములకు, భవానీలకు, భక్తులకు మహాగణపతి పీఠం స్వాములు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ గంగు జగన్‌మోహన్‌రెడ్డి, కోశాధికారి కోనా పార్వతి (గురు స్వామి), గుంట్ల వెంకటేశ్వరరావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు, బాకీ శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. దసరా మహోత్సవాల సందర్భంగా జంగారెడ్డిగూడేనికి చెందిన మద్దుల సుబ్రహ్మణ్యం దంపతులు, అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేశారు.

వాణిజ్య పంటల పరిశీలన


ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న తెలంగాణ మంత్రి తుమ్మల

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొల్లూరి రాంబాబు వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం తెలంగాణ వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వక్క, ఆయిల్ పామ్ పంటలతో పాటు పొల్ట్రీని సందర్శించారు. ఉద్యాన పంటలు, వాణిజ్య పంటల వివరాలను రాంబాబును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కుక్కల ధర్మరాజు, ఉప సర్పంచ్ రాఘవరెడ్డి, దమ్మపేట మాజీ జెడ్పీటీసీ సభ్యులు పి.వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

జంగారెడ్డిగూడెం: స్థానిక పేరంపేట రోడ్డులో పేకాట శిబిరంపై దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వారి నుంచి రూ.22 వేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అల్జీమర్స్‌పై అవగాహన అవసరం

దెందులూరు: అల్జీమర్స్ జ్ఞాపక శక్తి ఆలోచన ప్రవర్తన నెమ్మదిగా ప్రభావితం చేసే ఒక రకమైన న్యూరోలాజికల్ డిజార్డర్ అని, దీనిపై విస్తృతంగా అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని డాక్టర్ కె.ప్రదీప్ చంద్ర అన్నారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు పీహెచ్‌సీలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవం నేపథ్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. డాక్టర్ ప్రదీప్ చంద్ర మాట్లాడుతూ అల్జీమర్స్‌పై అవగాహన కల్పించారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీహెచ్‌ఓ రామాంజనేయులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులపై 'కూటమి' దాడి

నిడమర్రు: చంద్రబాబు సర్కారు కార్మికుల హక్కులపై దాడి చేస్తోందని. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా పని గంటలను 8 నుంచి 10 గంటల వరకూ పెంచడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు అన్నారు. నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం కానూరు రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నారపల్లి మాట్లాడుతూ చంద్రబాబు బడా పారిశ్రామిక వేత్తలకు లాభాలు కట్టబెట్టేలా కార్మికుల పని గంటలు పెంచారన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని వేళలను పెంచడాన్ని ప్రభుత్వం పునరాలోచించుకోవాలని డిమాండ్ చేశారు. కంచం వరప్రసాద్, గవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకం.. బతుకమ్మ

కుక్కునూరు: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ప్రాంతంలో ఆడపడుచులు ఆనందంగా ఉత్సాహంగా చేసుకునే బతుకమ్మ పండుగ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ పండుగ నేపథ్యంలో ఆడపడుచులు పూలతో తయారు చేసే బతుకమ్మలు ప్రకృతిలో మమేకం చేయడంతో పాటు వాటిలోని ఔషధ గుణాలు రోగాలను దూరం చేస్తాయి. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో భాగమైనా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ప్రతి గ్రామంలో బతుకమ్మ పండుగ ఎంతో ఉత్సాహంగా చేసుకుంటారు. ఎక్కడెక్కడో ఉన్న ఆడపడుచులు పుట్టింటికి చేరి బంధువులు, సన్నిహితులతో కలిసి ఆడుతూ, పాడుతూ ఉత్సాహంగా చేసుకునే బతుకమ్మ పండుగ కోసం ప్రతి ఆడపిల్ల వేచి చూస్తుంది. బతుకమ్మలను చెరువల్లో, కాలువల్లో, నదుల్లో నిమజ్జనం చేయడంతో వాటిలో ఔషధ గుణాలు నీటిలో చేరి అవి తాగిన వారికి మేలు చేస్తాయి.

పూలతో ప్రయోజనాలు

తంగేడుపూలు లివర్ సంబంధిత వ్యాధులకు ఔషధంగా పని చేస్తాయి. గునుగుపూలు దగ్గు, జలుబు


పలు రకాల పూలతో పేర్చిన బతుకమ్మ

వంటి శ్వాసకోశ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. బంతిపూలు చర్మ వ్యాధులను నివారిస్తాయి. గులాబీ పూలు చర్మానికి మేలు చేస్తాయి. ఇవి గాయాలు మానిపించగలవు. నందివర్ధనం పూలు కంటి సమస్యల నుంచి ఉపశమనం కలిస్తాయి. గన్నేరుపూలు చర్మ వ్యాధులను నయం చేస్తాయి. బిళ్లగన్నేరు పూలు రక్త విరేచనాలను, మంటలను తగ్గిసాయి. మందారపూలు జుట్టుకు మేలు చేస్తుంది. తామరపువ్వుతో అలర్జీలు తగ్గిపోతాయి. లివర్, బ్రెయిన్ హెల్త్‌ని కాపాడుతుంది. గుమ్మడి పువ్వు వయసు మీద పడ్డాక వచ్చే కాళ్ల నొప్పులను దూరం చేస్తుంది. ప్రోస్టేట్ గ్రంధికి రక్షగా నిలుస్తుంది.


బతుకమ్మను తలపై పెట్టుకొని వెళుతున్న చిన్నారి

బతుకమ్మను ఉత్సాహంగా జరుపుకుంటాం



ప్రతి సంవత్సరం మా కాలనీలో వాళ్లు కలిసి ఉత్సాహంగా జరుపుకుంటాం. రోజూ బతుకమ్మలను పేర్చి ఒక చోట ఉంచి పాటలతో నృత్యాలు చేస్తూ సంతోషంగా గడుపుతాం.

–వనమా సత్యవేణి, గృహిణి, కుక్కునూరు

తొమ్మిది రోజుల కోసం ఏడాదిగా ఎదురుచూస్తాం



బతుకమ్మ తొమ్మిది రోజుల కోసం ఏడాదంతా ఎదురు చూస్తాం. పెళ్లి చేసుకొని ఇతర ప్రాంతాల్లో ఉన్న మహిళలు, పాత మిత్రులను ఈ బతుకమ్మ పండుగ ఏకం చేస్తుంది. మా మహిళలకు ఈ పండుగ ఇచ్చినంత ఆనందం ఏ పండుగ ఇవ్వదు.

–హారిక, ఇంజనీరింగ్ విద్యార్థిని, కుక్కునూరు

పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది


సీఐ వెంకటేశ్వరరావు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలో మూడు పోలీస్ స్టేషన్లలో పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉన్నట్లు సీఐ వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా సభలు సమావేశాలు నిర్వహించ కూడదని చెప్పారు. అలాగే సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏలూరు ఎంపీడీఓగా దయాసాగర్

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం ఎంపీడీఓగా భీమనేని దయాసాగర్ ఏలూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా చేసిన శ్రీలత పశ్చిమగోదావరి జిల్లా జాతీయ ఉపాధి హామీ పథకం పీడీగా పదోన్నతి బదిలీ రావడంతో ఆమె స్థానంలో దయాసాగర్ నియమితులయ్యారు.

కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలి

కొయ్యలగూడెం: అసంఘటిత రంగంలో పని చేస్తున్న ముఠా, హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం కోసం ఏఐటీయూసీ సుదీర్ఘకాలంగా పోరాడుతుందని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కొయ్యలగూడెం మార్కెట్ యార్డులో ఐరన్, సిమెంట్ షాపుల్లో పని చేస్తున్న ముఠా కార్మికుల సమావేశం తాడిగడప ఆంజనేయరాజు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ముఠా కార్మికుల సంఘ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తాడిగడప ఆంజనేయరాజు, అధ్యక్షుడిగా వెలగల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాక్షుడిగా బొబ్బర చిట్టిబాబు, కార్యదర్శిగా పులపాకుల దుర్గారావు, సహాయ కార్యదర్శిగా డోరా వరప్రసాద్, కోశాధికారిగా సంపతరావు, సభ్యులుగా కోరుకొల్లు నాగరాజు, అయినపర్తి రాజశేఖర్ ఎన్నికయ్యారు. సమావేశంలో డాంగే, వెంకటేశ్వరరావు, ఏఐటీయూసి నాయకులు లక్క లక్ష్మణరావు, గోలిమే బాల ఏసు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా అధ్యక్షుడు

గ్రామాల్లో మొదలైన దసరా సందడి


ద్వారకాతిరుమల: దసరా ఉత్సవాలకు ముస్తాబైన మందిరం


కొయ్యలగూడెం: కనకదుర్గమ్మ

ద్వారకాతిరుమల: గ్రామాల్లో దసరా పండుగ సందడి మొదలైంది. ఆదివారం ఎక్కడ చూసినా మందిరాల్లో కొలువుదీరనున్న దుర్గాదేవి విగ్రహాలే కనిపించాయి. సోమవారం నుంచి ప్రారంభం కానున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ద్వారకాతిరుమలలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు మందిరాన్ని నెలకొల్పి, ముస్తాబు చేశారు. అమ్మవారి లక్ష్మీపురంలోని శ్రీసంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు చేర్చారు. సోమవారం ఉదయం అమ్మవారి విగ్రహం నెలకొల్పనున్నారు. దొరసానిపాడు, వేంపాడు తదితర గ్రామాల్లో ఈ ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించనున్నారు. క్షేత్రంలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

కొయ్యలగూడెం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నేటి నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. కొయ్యలగూడెం వై.జంక్షన్ కనకదుర్గమ్మకు దసరా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అర్చకులు లక్ష్మణశర్మ రజిత వస్త్ర అలంకరణ చేశారు. కొయ్యలగూడెం, బయ్యలగూడెం లలోశ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయాలతో పాటుగా కన్నాపురం, దిప్పకాయలపాడు, అమృతాపురం, గవరవరం, ఎర్రంపేట, రాజవరం, గంగవరం గ్రామాలతో పాటుగా రింగ్ రోడ్డు గ్రామాలలో కనకదుర్గమ్మ ఆలయాలు దసరా ఉత్సవాలకు ముస్తాబు అయ్యాయి. ఇప్పటికే చలువ పందిళ్లను ఏర్పాటు చేసిన నిర్వాహకులు పది రోజులపాటు నిర్వహించే అమ్మవార్ల అలంకరణకు కావలసిన ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రముఖుల ప్రసంగాలను దసరా రోజులలో నిర్వహించనున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన భీమిరెడ్డి వెంకన్నబాబు రామన్నపాలెం మండల పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ రాయింకుల సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా ఉన్న నాకు రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చిన చింతలపూడి నియోజకవర్గం కన్వీనర్ కంభం విజయరాజుకు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కు రుణపడి ఉంటానని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2029లో ముఖ్యమంత్రి చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను అని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ గుర్రాల రవికుమార్, కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్ పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణను కలిసిన ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకన్నబాబు

గురజాడకు ఘన నివాళి

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మహాకవి గురజాడ జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌కు చెందిన ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె.రత్నశేఖర్ మాట్లాడుతూ గురజాడ రాసిన కన్యాశుల్కం తెలుగు నాటిక రంగంలోనే మైలురాయి వంటిదని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, ఎం.విజయకృష్ణ, బి.రాజు పాల్గొన్నారు.


గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

171 మందికి కంటి పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో నగరానికి చెందిన సామాజికవేత్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వేమగిరి బృందంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి 171 మంది హాజరయ్యారు. వారందరికీ వైద్య బృందం నేత్ర పరీక్షలు నిర్వహించి 21 మందికి శస్త్రచికిత్సలు అవసరమవుతాయని నిర్ణయించారు. శస్త్ర చికిత్సలు అవసరమవుతాయని గుర్తించిన వారందరినీ వేమగిరి హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించి తిరిగి ఏలూరుకు చేర్చుతారని రామారావు తెలిపారు. కాగా ఆ శిబిరంలో కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన 27 మందికి సబ్సిడీ ధరలకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శిబిరంలో పాల్గొన్న పేదలకు బొలిశెట్టి సురేష్ కుమార్, పిల్లి పండరీనాథ్, తవ్వ అజయ్ కుమార్ తదితరులు సేవలు అందించారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

చింతలపూడి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి ఆతుకూరి సుబ్బారావు, రాష్ట్ర దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి తాటిపర్తి రాజులను ఆదివారం చింతలపూడిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొడ్డు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు నాయకులు కలిసికట్టుగా పనిచేస్తే స్థానిక సంస్థల్లో విజయం సాధించొచ్చన్నారు. పదవులు పొందిన నాయకులు, కార్యకర్తలు పార్టీ ప్రతిష్ఠకు కృషి చేయాలన్నారు. సుబ్బారావు, తాడిపత్రి రాజు మాట్లాడుతూ తమను ఈ పదవులకు ఎంపిక చేసిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరావులకు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కనమతరెడ్డి చండీప్రియ, ఎస్.కాంతారావు, గురుబ్రహ్మం, ఎం.ఇమ్మానియేల్, గోపాలకష్ణ, ఎం.దుర్గారావు, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, కె.వెంకటేశ్వరరావు, రహీం, ప్రకాష్, డి.పేర్రాజు, బందారు గోపి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర పదవులకు ఎంపికైన వారిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గిరిపుత్రులు మెచ్చిన ఆహారం

- గిరిజనుల ఆహారంలో భాగం పుట్టగొడుగులు
- నాటు పుట్టగొడుగులకు పెరిగిన డిమాండ్

బుట్టాయగూడెం: వర్షాకాలం ప్రారంభం కాగానే అటవీ ప్రాంతంలో పుట్ట గొడుగులు పెరుగుతూ ఉంటాయి. వీటిని గిరిజనులు ఎక్కువగా ఇష్టపడతారు. అటవీ ప్రాంతంలో పెరిగే పుట్టగొడుగులు గిరిపుత్రుల ఆహారంలో భాగమవుతున్నాయి. అయితే ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రంగానే కురిశాయి. అయితే గత వారం రోజుల క్రితం నుంచి కురుస్తున్న వర్షాలతో పశ్చిమ మన్యంలోని అటవీ ప్రాంతంలో పుట్టల్లో నాటు పుట్టగొడుగులు అత్యధికంగా లభిస్తున్నాయి. వర్షాలతో పడడంతో పుట్టలపై పుట్టగొడుగులు కనిపిస్తున్నాయి. దీంతో అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గిరిజనులు నాటు పుట్టగొడుగులను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

కట్ట రూ.100 చొప్పున విక్రయం

అటవీ ప్రాంతంలో లభించే పుట్టగొడుగులను 25 నుంచి 30 వరకు ఒక కట్టగా కట్టి సుమారు రూ.100కు గిరిజనులు విక్రయిస్తున్నారు. అడవిలో లభించే నాటు పుట్టగొడుగులకు అధిక డిమాండ్ ఉంది. పుట్టగొడుగులు అడవి నుంచి తీసుకువచ్చి వెంటనే అమ్ముడుపోతున్నాయి. అయితే పుట్టగొడుగుల సేకరణ అంత సులభం కాదు. తెల్లవారు జామున అటవీ ప్రాంతానికి వెళ్లి పుట్టలపై ఉన్న పుట్టగొడుగులను సేకరించాలి. ఒక్కోసారి ఆ పుట్టల్లో పాములు కూడా ఉంటాయి. అలాగే చీమలు కూడా కుడతాయి. పుట్టగొడుగులకు వెళ్లిన గిరిజనులు విషపురుగుల బారిన పడిన సంఘటనలూ ఉన్నాయి. అయితే ప్రతి ఏటా వర్షాకాల సీజన్‌లో ఈ ప్రాంతానికి వచ్చి పుట్టగొడుగులను తీసుకెళ్లిన వారు ఉన్నారు. ఈ ఏడాది కూడా వర్షాలకు పుట్టగొడుగులు లభించడంతో వాటి కోసం అనేక మంది ఏజెన్సీకి క్యూ కడుతున్నారు. కొంతమంది వీటిని గిరిజన ప్రాంతంలో రూ.100కు కొనుగోలు చేసి, బయటి ప్రాంతాల్లో రూ.300 నుంచి రూ.400 వరకూ విక్రయిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే ఈ పుట్టగొడుగులు ఎంతో రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యవంతమని గిరిజనులు చెబుతున్నారు.


అటవీప్రాంతంలో లభించిన నాటు పుట్టగొడుగులు

చిన్నప్పటి నుంచి తింటున్నాను



నేను చిన్నప్పటి నుంచి మా అడవిలో లభించే పుట్ట గొడుగులను తింటున్నాను. ఏది తినాలి, ఏది తినకూడదు అనే విషయాన్ని మా పెద్దల ద్వారా తెలుసుకుని మరీ తింటున్నాను. వర్షకాలం వచ్చిందంటే మా గ్రామంలో అందరూ అడవికి వెళ్లి సేకరిస్తారు. అధికంగా లభిస్తే బయట వ్యక్తులకు విక్రయిస్తాం.

–కోర్స గంగరాజు, కామవరం, బుట్టాయగూడెం మండలం

అటవీ ప్రాంతంలో అధికంగా లభిస్తాయి



మా గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో నాటు పుట్టగొడుగులు అధికంగా లభిస్తాయి. ప్రతి ఏటా వర్షాలు కురిసే సమయంలో ఈ పుట్టగొడుగులు మొలుస్తాయి. వాటిని సేకరించి తింటాం. ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచిది.

కోర్స రాంబాబు, కామవరం, బుట్టాయగూడెం మండలం

ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

ఏలూరు (టూటౌన్): కార్మికులందరూ తక్షణమే ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ సహాయ సంచాలకులు నాగేశ్వరరావు కోరారు. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో పెయింటింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో కన్వీనర్ లొట్ల సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్) నాగేశ్వరరావు మాట్లాడుతూ పెయింటింగ్ కార్మికులందరూ లేబర్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఇఫ్టూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు ప్రముఖ న్యాయవాది కేవీ రత్నం మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో వందల కోట్ల రూపాయలు ఉన్నాయని అవి కార్మికులకు సంబంధించిన కుటుంబాల అవసరాలకే వాడాలని కోరారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏలూరు ఏరియా పెయింటింగ్ కార్మిక సంఘాన్ని ఇఫ్టూకీ అనుబంధం చేయాలని ఏలూరు పెయింటింగ్ కార్మికులు తీర్మానం చేశారు. ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు నవుడు నెహ్రూ బాబు, కాకర్ల శ్రీను, ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు లింగమల్లి శ్రీనివాసరావు, అరుణోదయ సాంస్కృతి సమాఖ్య ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి పల్లి గంగరాజు, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక శాఖ ఏసీఎల్ నాగేశ్వరరావు

నిర్వహణ లోపం.. రహదారికి శాపం

- సీసీ–బీటీ అప్రోచ్‌ల వద్ద ప్రమాదకరంగా గుంతలు
- గత ప్రభుత్వంలో రూ.6 కోట్లతో రహదారి నిర్మాణం
- కూటమి ప్రభుత్వంలో ప్రమాదాలతో స్థానికుల ఇక్కట్లు

నిడమర్రు: మండలంలో ఏళ్ల తరబడి అధ్వాన్నంగా ఉన్న రహదారులకు గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో మోక్షం కలిగింది. కానీ కూటమి ప్రభుత్వం ఆ రహదారుల నిర్వహణ గాలికి వదిలేయడంతో గత ప్రభుత్వంలో నిర్మించిన ఆర్‌అండ్‌బీ రహదారులన్నీ రోజు రోజుకూ అధ్వానంగా మారుతూ ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నాయి. గణపవరం మండలం సరిపల్లి నుంచి ఉంగుటూరు మండలం నారాయణపురం వరకూ గత ప్రభుత్వంలో నిర్మించిన ఆర్‌అండ్‌బీ రహదారి నిర్వహణలోపంతో రోజు రోజుకు ప్రమాదకరంగా మారుతోంది. భీమవరం నుంచి మొదలు నారాయణపురం వరకూ ఉన్న ప్రయాణికులు ఏలూరు వెళ్లాలంటే ఇదే మార్గం. దీంతో ప్రతీ రోజు వేలాది వాహనాలు ఈ గణపవరం– ఏలూరు రోడ్డు పైనే వెళుతున్నాయి. ఈ రోడ్డు నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో ఎక్కడిక్కడ పెద్ద పెద్ద గుంతలతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.


మండలపర్రు- నిడమర్రు మలుపులో ప్రమాదకరంగా ఉన్న రహదారి

ప్రమాదకరంగా బీటీ–సీసీ అప్రోచ్‌లు

గణపవరం నుంచి మండల కేంద్రం నిడమర్రు వరకూ పలు చోట్లు సీసీ రోడ్డులు నిర్మించారు. అయితే ఈ సీసీ రహదారికి, తారు రోడ్డుకు మధ్య ఉన్న అప్రోచ్‌లు వద్ద ఉన్న రోడ్డు కుంగిపోయి పెద్ద పెద్ద గోతులుగా మారుతున్నాయి. దీంతో సీసీ రహదారిపైకి ఎక్కాలన్నా, దిగాలన్నా అటు కార్లు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ అప్రోచ్‌ల వద్ద ద్విచక్రవాహనదారులు పడిపోయి కాళ్లు చేతులు విరగొట్టుకున్న సంఘటనలు జరిగినట్లు స్థానిక ప్రజలు చెపుతున్నారు. పలు చోట్ల గోతులు ఉన్నాయని హెచ్చరిస్తూ స్థానికులే ఆయా గోతుల్లో జండాలు, బకెట్లు ఉంచి వాహనదారులను హెచ్చరిస్తున్నారు.

గత ప్రభుత్వంలో రూ.6 కోట్లతో నిర్మాణం

దశాబ్ద కాలంగా ఏలూరు వెళ్లాలన్నా, మండల కేంద్రం నిడమర్రు వెళ్లాలన్నా స్థానిక గ్రామస్థులు ఈ రహదారిపై అనేక ఇబ్బందులు పడేవారు దీంతో రూ.6 కోట్లతో నాటి ప్రభుత్వంలో ఈ రహదారిని నిర్మాణం పూర్తి చేశారు. గణపవరం నుంచి నిడమర్రు వరకూ 8 కిలోమీటర్లు మార్గంలో గతంలో అధ్వానంగా ఉన్న చోట్ల సీసీ రోడ్డు నిర్మాణం జరిగింది. గణపవరం మహాలక్ష్మి కూడలి, బువ్వనపల్లి వెలంపేట, మండలపర్రు పెట్రోల్ బంక్, నిడమర్రులో 2 చోట్ల సీసీ రోడ్డును వేసారు. మార్చి 2024తో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. కానీ నేటి వరకూ నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం కారణంగా గుత్తేదారునితో కనీస మరమ్మతులు చేయించకపోవడంతో ఈ మార్గం గోతులు, గొప్పులుగా మారుతోంది. ఇక నైనా అధికారులు స్పందించి 5 శాతం నిర్వహణ నిధులతో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.